ముువ్వల సవ్వడి..

శాస్త్రీయ, సంప్రదాయ నాట్యంపై యాదగిరిగుట్ట చిన్నారుల ఆసక్తి

● పుణ్యక్షేత్రాల్లో నృత్య ప్రదర్శనలు ● ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, డ్యాన్స్ అకాడమీలు



యాదగిరిగుట్ట : ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో చాలా మందికి నృత్యం అంటే మాస్ స్టెప్పులు తప్ప మరేవీ గుర్తుకురావు. సంప్రదాయ, శాస్త్రీయ, జానపద, గిరిజన నృత్యాలు ఉన్నాయన్న విషయం తెలియదు. కానీ, యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన పలువురు చిన్నారులు సంప్రదాయ నృత్య ప్రదర్శనలిస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో ప్రతి శుక్ర, శనివారాల్లో సాయంత్రం కూచిపూడి, భరత నాట్యం ప్రదర్శిస్తూ భక్తులను అలరిస్తున్నారు.

అవార్డులు, ప్రశంసలు

యాదగిరిగుట్టకు చెందిన పలువురు విద్యార్థులు సంప్రదాయ నృత్యాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. మిర్యాల నిఖిల ఐదేళ్ల వయస్సు ఉన్నప్పటినుంచే నృత్య ప్రదర్శనలు ఇస్తోంది. ఇప్పటి వరకు 80కి పైగా ప్రదర్శనలు చేసి పలు అవార్డులు సాధించింది. 2019లో ఉత్తమ బాల కళాకారిణి అవార్డు అందుకుంది. ఇక చెడుదూప్ బృందావని లింకా గిన్నిస్ బుక్ రికార్డుకు నామినేట్ అయింది. అలాగే యాదగిరిగుట్ట క్షేత్ర వైభవంపై పలు చానళ్లు చిత్రీకరించిన వీడియోలో లింగాల ప్రణుతి, వీణ కూచిపూడి నృత్యాలతో ఆకట్టుకున్నారు. వీరితో పాటు పట్టణానికి చెందిన మరికొందరు చిన్నారులు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి, పాతగుట్ట క్షేత్రంతో పాటు కాణిపాకం గణపతి ఆలయంలో ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శనలిస్తున్నారు.

నృత్యకారిణిలుగా తీర్చిదిద్దుతూ..



కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థులు

భువనగిరికి చెందిన రమేష్‌రాజ్ 24 ఏళ్ల క్రితం డ్యాన్స్ స్టూడియో ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యార్థులు, కళాకారులను డ్యాన్సర్లుగా తీర్చిదిద్దారు. అనంతరం యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలో సిరిసిరి కూచిపూడి నృత్యాలయం స్థాపించి ఆసక్తి ఉన్నవారికి సంప్రదాయ నృత్యాలు నేర్పించారు. 2013లో యాదగిరిగుట్టలో కూచిపూడి నృత్యాలయం స్థాపించారు. ఐదుగురితో ప్రారంభమైన నృత్యాలయం 60 మందికి చేరింది.

కళ

ఐదేళ్ల నుంచే కూచిపూడి నేర్చుకున్నా



నేను 2వ తరగతి నుంచి ఐదేళ్ల వయస్సులో ఉన్నప్పటి నుంచి కూచిపూడి నాట్యం నేర్చుకుంటున్నాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు నేను 80కి పైగా వేదికలపై కూచిపూడి ప్రదర్శన చేశాను. నా ప్రదర్శనకు అస్థిత్వం సంస్థ రాష్ట్ర స్థాయి పురస్కారం, కీర్తి అకాడమీ బాలరత్న, నాట్యరవళి అవార్డులు ఇచ్చారు. నాన్న ప్రోత్సాహమే నృత్యం నేర్చుకోవడానికి ప్రధాన కారణం.

– మిర్యాల నిఖిల, కూచిపూడి నృత్యకారిణి

సంప్రదాయ నృత్యాలపై మక్కువ



యాదాద్రీశుడు కొలువైన పట్టణంలో సంప్రదాయ నృత్యాలను ప్రోత్సహిస్తున్న డ్యాన్స్ మాస్టర్ రమేష్‌రాజ్ సార్‌కు కృతజ్ఞతలు. మా తల్లిదండ్రులకు సంప్రదాయ నృత్యాలపై మక్కువ ఎక్కువ. వారి ప్రోత్సాహంతోనే యాదాద్రి డ్యాన్స్ అకాడమీలో కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నాను. వివిధ వేదికలపై, ఆలయాల్లో ప్రదర్శనలు ఇవ్వడం సంతోషాన్నిచ్చింది.

– లింగాల ప్రణుతి, కూచిపూడి నృత్యకారిణి

సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలు నేర్పిస్తున్నా



24సంవత్సరాలుగా జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో డ్యాన్స్ అకాడమీలను ఏర్పాటు చేసి భారతీయ సంప్రదాయ, సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలను చిన్నారులకు, విద్యార్థులకు నేర్పిస్తున్నాను. యాదాద్రి డ్యాన్స్ అకాడమీని కూచిపూడి నిలయంగా మార్చేందుకు కృషి చేస్తున్నాను. యాదాద్రీశుడు కొలువైన యాదగిరిగుట్టలో సంప్రదాయ నృత్యాలకు నిలయంగా ఉండాలని కోరుకుంటున్నాను. 5మందితో ప్రారంభమైన యాదాద్రి డ్యాన్స్ అకాడమీ అంచెలంచెలుగా ఎదుగుతుంది.

– రమేష్‌రాజ్, డ్యాన్స్ మాస్టర్

50కి పైగా ప్రదర్శనలు ఇచ్చాను



నేను ఎనిమిదేళ్ల వయస్సు ఉన్నప్పటి నుంచి కూచిపూడి, సంప్రదాయ నృత్యాలను నేర్చుకుంటున్నా. 50కి పైగా ప్రదర్శనలు రవీంద్రభారతీ, వివిధ ఆలయాలు, పోచంపల్లిలో జరిగిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలో కూచిపూడి నృత్యాలు చేశాను. అద్భుతమైన నృత్య ప్రదర్శనతో 2022కు ముందు నన్ను లింకా గిన్నిస్ బుక్ రికార్డుకు పేరును ప్రతిపాదించారు. నా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కూచిపూడి నృత్యం చేసేందుకు ఎంతో సహకరించారు.

– చెడిదూప్ బృందావని, నృత్యకారిణి

క్లుప్తంగా

స్టాపర్ల తొలగింపు



వంగపల్లి వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లను తొలగిస్తున్న గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్..

యాదగిరిగుట్ట రూరల్ : హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి నుంచి మండలంలోని వంగపల్లి గ్రామానికి వచ్చే కూడలి వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లను శనివారం గ్రామస్తులు తొలగించారు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు గ్రామంలోకి రాకుండా నేషనల్ హైవే అధికారులు రహదారిపై స్టాపర్లను పెట్టారు. దీంతో వంగపల్లి గ్రామానికి బస్సులు రాకుండా బైపాస్ నుంచి వెళ్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై 'వంగపల్లికి రాని ఆర్టీసీ బస్సులు' అనే కథనాన్ని శుక్రవారం సాక్షిలో ప్రచురించగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. దీంతో వంగపల్లి కూడలి వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లను ఉదయం తొలగించారు.

గుర్రపుడెక్క ఆకు తొలగింపు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఇరిగేషన్ డీఈ కృష్ణారెడ్డి

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జగత్‌పల్లి నుంచి చౌటుప్పల్ మండలంలోని పంతంగి వరకు దివీస్ లేబోరేటరీస్ పరిశ్రమ సౌజన్యంతో పిలాయిపల్లి కాల్వలో పూడికతీతతో పాటు కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్కాకు తొలగించే పనులను శనివారం ఇరిగేషన్ డీఈ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుమారు 45కిలోమీటర్ల మేర పనులు చేపడుతున్నారని తెలిపారు. అనంతరం దివీస్ పరిశ్రమ సీఎస్ఆర్ విభాగం అధికారి బి.గోపి మాట్లాడారు. రూ.10లక్షలతో పనులు చేపడుతున్నట్లు, రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ తరుణ్‌తేజ, గ్రామస్తులు బొబ్బల బాలకృష్ణారెడ్డి, కోట రామచంద్రారెడ్డి, దివీస్ పరిశ్రమ ప్రతినిధి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు సదర్ సమ్మేళనం

రామన్నపేట : మండల కేంద్రంలో అఖిల భారత యాదవ మహాసభ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సదర్ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు యాదవ మహాసభ మండల అధ్యక్షుడు తిరుగుడు మల్లికార్జున్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే సమ్మేళనానికి మండలంలోని యాదవులంతా అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

విద్యారంగ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భువనగిరి : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యను పట్టించుకోకుండా పాలన కొనసాగిస్తుందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రాకపోవడంతో విద్యార్థులు చదువులు అంధకారంలో సాగుతున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు అన్నారు. శనివారం పట్టణంలోని వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన సభ్యత్వ నమోదులో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం కళాశాలలో సంఘం కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్, జిల్లా కమిటీ సభ్యులు భవానీ శంకర్, మహేష్, శివాజీ, చందు, పూజిత, మేఘన, సంజన, లక్ష్మి, శివాని తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంచాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

మోత్కూరు : కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పెన్షన్ రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక భువనగిరి డివిజన్ ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పెన్షన్ పెంచాలని కోరుతూ నవంబర్ 20నుంచి డిసెంబర్ 9వరకు రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక డివిజన్ గౌరవ అధ్యక్షులు రాజు, నాయకులు గుండు శ్రీను, మండల అధ్యక్షులు ఎర్రబెల్లి నాగేశ్వర్, లింగయ్య తదితరులున్నారు.

ఘనంగా జాతీయ ఫార్మసీ వారోత్సవాలు



భువనగిరి : ర్యాలీ నిర్వహిస్తున్న స్వామి వివేకానంద ఫార్మసీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

భువనగిరి : యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామపరిధిలో గల స్వామి వివేకానంద ఫార్మసీ కళాశాల విద్యార్థులు జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా శనివారం పట్టణంలో ఫార్మసీ విద్యా ప్రాముఖ్యత, ఉద్యోగ అవకాశాలు, సమాజంలో ఫార్మసిస్టులు చేస్తున్న సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఉదయకుమార్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ హేమమాలిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్ : మండలంలోని రాయగిరిలో గల యూనిటీ ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలు, క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అంపటి శ్రీనివాస్, పీజీ కళా శాల ప్రిన్సిపాల్ సరిత, ఏఓ సునీత, రాజీవ్, ఇస్మాయిల్, ప్రియాంక, అమూల్య, సాహితీ, పారిజాత, అమర్నాథ్, నాగరాజ్, అహ్మద్, అనిత, దివ్య పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి



పోలీస్‌స్టేషన్‌ను సందర్శిస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్

యాదగిరిగుట్ట రూరల్ : పోలీసులు ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలని యాదాద్రి ఏసీపీ రమేష్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులు, నమోదైన కేసులు, రిసెప్షన్, ఎస్‌హెచ్‌ఓ లాక్ అప్, స్టేషన్ రైటర్, రెస్ట్‌రూమ్, పోలీస్ వాహనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు రక్షణ కల్పించాలన్నారు. అదేవిధంగా పట్టణంలోని లాడ్జీలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని సూచించారు. అంతకుముందు కానిస్టేబుళ్ల డ్రిల్ నిర్వహించారు. విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించిన కానిస్టేబుల్స్ అనిల్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్, రవీందర్, స్వాతికి రివార్డులు అందజేశారు. ఆయన వెంట యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్, ఎస్ఐ ఉదయ్ తదితరులున్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రభుత్వం కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

భువనగిరిటౌన్ : దేశంలో రాజ్యాంగాన్ని మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు అన్నారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరికీ సమాన హక్కులు ఉండే విధంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు. సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండమడుగు నర్సింహ, సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నంపట్ల కృష్ణ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిల్వంగి స్వామి, ప్రజాసంఘాల నాయకులు మాటూరి బాలరాజు, లావుడియా రాజు, దయ్యాల నర్సింహ, ముత్యాలు, అంజయ్య, నాగమణి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

భూదాన్‌పోచంపల్లి : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి బీసీ బాలుర హాస్టల్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్‌స్కూల్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న బియ్యం, కూరగాయల, వంట సామగ్రి నాణ్యతను పరిశీలించారు. అలాగే కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో వండిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. చలికాలంలో విద్యార్థులకు దుప్పట్లు అందజేశారని అడిగి తెలుసుకున్నారు. మెనూ, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు యూనిఫామ్‌ను అందజేశారు. ఆయన వెంట ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, వార్డెన్ కరుణశ్రీ, ఎస్ఓ ఇందిర, మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ నవీన్‌కుమార్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆత్మకూరు(ఎం): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సంక్షేమ హాస్టళ్లతోపాటు కేజీబీవీని ఆయన సందర్శించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీఓ రాములు నాయక్, సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



బొమ్మలరామారం : భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

బొమ్మలరామారం : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు సూచించారు. శనివారం మండలంలోని మల్యాల గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట : చెక్‌డ్యాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో రూ.కోటి 65లక్షలతో నిర్మించనున్న చెక్‌డ్యామ్ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రైతులకు ఇచ్చిన హామీల మేరకు రుణమాఫీని చేసామని, త్వరలో రైతు భరోసా కూడా అమలు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే డిసెంబర్‌లో ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్‌లు, రేషన్ కార్డులు ఇస్తామని అన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో 8 చెక్‌డ్యామ్‌లను మంజూరు చేయించుకున్నామని, ఇందులో 4పూర్తికాగా, మిగిలినవి త్వరలోనే పూర్తి చేసుకుంటామన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ప్రతీ చెరువును నింపనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండకూడదని రూ.210 కోట్లతో మిషన్ భగీరథ పైలాన్ పనులు కూడా చేపట్టామని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, రాంచందర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని వినతి

ఆలేరురూరల్ : ఆలేరు ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ రెవెన్యూ డివిజన్ పోరాట సాధన కమిటీ సభ్యులు శనివారం స్థానికంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కోకన్వీనర్ ఆర్.జనార్దన్, చెక్క వెంకటేష్, ఎండీ సలీం, ఉప్పలయ్య, అడివయ్య, గంగేష్, రవి, అశోక్, కృష్ణ, సమరసింహారెడ్డి, వెంకటేష్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పోషకాహారంతో కూడి భోజనం అందించాలని అధికారులను కోరారు. అనంతరం పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో జరుగుతున్న పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొల్పుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, పార్టీ పట్టణ, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, ర్యాకల శ్రీనివాస్, అజీమోద్దీన్, భిక్షపతి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ తీసుకువచ్చింది కేసీఆరే

● డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట : ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాలన్న ఉద్దేశంతో కేసీఆర్ మిషన్ భగీరథ పథకం తీసుకువచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసేందేమీ లేదని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ మీదుగా ఆలేరు, భువనగిరి ప్రాంతాలకు గోదావరి జలాలు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కావస్తుందని, ఏ కాల్వలు తవ్వించారు, నీళ్ల కోసం ఏం పనులు చేయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. తట్టెడు మట్టి తీయకుండానే, కాల్వలు ఏర్పాటు చేయకుండానే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు నీళ్లు తీసుకువచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానం పరిధిలో ఈనెల 22న మిషన్ భగీరథ పైప్‌లైన్ పైలాన్ శంకుస్థాపన పేరుతో కాంగ్రెస్ ఫ్లెక్సీలు, జెండాలను కట్టడానికి ఆలయ ఈఓ ఎలా అనుమతించారని ప్రశ్నించారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న గొంగిడి సునీత అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైస్‌మిల్లర్ల వద్ద, కాంట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వచ్చినవి నిజం కాదా అన్నారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదగిరిగుట్ట దేవస్థానంలో దుకాణాల కోసం డబ్బులు వసూలు చేశారని సోషల్ మీడియాలో వస్తే ఎందుకు సమాధానం చెప్పడం లేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ నాగరాజు, పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, నాయకులు సత్యనారాయణ, దావూద్, రామస్వామి, మహేందర్, నర్సింహ, శ్రీధర్, వీరేశం, క్రాంతి, కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో శ్రీరంగనాయకస్వామి దేవాలయ భూమిలో అక్రమంగా నిర్మించుకుంటున్న ఇంటిని అడ్డుకున్నందుకు యాదగిరి అనే వ్యక్తి గ్రామస్తులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. గ్రామానికి చెందిన కుతాడి యాదగిరి దేవాలయ భూమిలో అక్రమంగా ఇంటిని నిర్మించుకుంటున్నాడని, దీనిని అడ్డుకొంటే గ్రామస్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అక్రమ కేసులు నమోదు చేయించాడని తెలిపారు. అనంతరం గ్రామస్తులంతా కలిసి చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. కార్యక్రమంలో బందారపు లక్ష్మణ్, సతీష్‌చారి, విశ్వనాథం, భూషన్, శేఖర్ రెడ్డి, సందీప్‌రెడ్డి శంకర్, సాబేర్‌ఖాన్ ఉన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

భువనగిరిటౌన్ : భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లిలో ఈనెల 19న ఎరుకల కులానికి చెందిన కూతాటి యాదగిరి గుడిసెను కూల్చేసి ఆ కుటుంబంపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం కలెక్టర్ హనుమంతరావుకు ఎరుకుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వారిలో లోకిని రాజు, శ్రీరామ్ సదానందం, కూతాడి రవికుమార్, వనం రమేష్, కోనేటి నరసింహ, సురేష్, యాదగిరి ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మహాసభలను విజయవంతం చేయాలి

భువనగిరిటౌన్ : డిసెంబర్ 14న నిర్వహించే తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సలహాదారు బట్టు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సంఘం నాయకులు విడుదల చేశారు.

నవంబర్ 26న దేశవ్యాప్త ఆందోళనలు

భువనగిరిటౌన్ : దేశంలో ప్రధాని నరేంద్రమోదీ అవలంబిస్తున్న విధానాలపై నవంబర్ 26న చేపట్టే దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు జాయింట్ ప్లాట్ ఫారమ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా ప్రతినిధులు తెలిపారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ మాయ దశరథ తెలిపారు. శనివారం మున్సిపాలిటీలోని పలు వార్డులో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ పి.రామాంజులరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ రత్నపురం బాలరాం తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరిటౌన్ : గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాలయంలో విద్యార్థులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానని గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి సేవలను, పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సెక్రెటరీ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని దండుమల్కాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జయంత్, హెచ్ఎంలు భాస్కర్, కోటేశ్వర్‌రావు, దివీస్ ప్రతినిధులు సాయికృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, సూపర్‌వైజర్ అనిత, ఏఎన్ఎంలు అనిత, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి : పట్టణంలో 33కేవీ విద్యుత్ తీగల షిఫ్టింగ్ పనుల కారణంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ పట్టణ ఏఈ సాయికృష్ణ శనివారం తెలిపారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామ నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సామేల్ రూ.20లక్షల నిధులు మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ మండల కార్యదర్శి రాచకొండ బాలరాజుగౌడ్ శనివారం తెలిపారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు

చౌటుప్పల్ రూరల్ : పట్టణంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు ఆందోజు శంకరచారి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య, నాయకులు తాడూరి పరమేష్, నిర్మల, రాణి ఉన్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో వినతి

చౌటుప్పల్ రూరల్: పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డీఓకు శనివారం వినతిపత్రం అందజేశారు.

ఎంఎస్ఎన్ పరిశ్రమ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

బీబీనగర్ : మండల కేంద్రంలో ఎంఎస్ఎన్ పరిశ్రమ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన వివిధ ఆస్పత్రుల వైద్యులతో 8 రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ రమేష్, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మీశ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గోళి నరేందర్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు అక్బర్, నాయకులు నవీన్, పరిశ్రమ అధికారులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

భువనగిరి : గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహించినట్లు భువనగిరి విద్యుత్ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.